క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యాచారం: విద్యుత్ లైను మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ జీవన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపర్తి గ్రామం, పరిధి వ్యవసాయ పొలాలు, తమ్మలోనిగూడ గ్రామ, పరిధి పంట పొలాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉత్సవాలను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య కోరారు. సోమవారం తుర్కయంజాల్‌లో జిల్లా కౌన్సిల్ సభ్యులు శివకుమార్ గౌడ్ అధ్యక్షతన ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి డిసెంబర్ 26కు వంద సంవత్సరాలు పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివ కుమార్, కృష్ణ, బ్రహ్మయ్య, శ్రీను గౌడ్, యాదగిరి, కోట్యనాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత ఇంట్లో త్రిపుర గవర్నర్ సందడి


ప్రతాప్ కుటుంబ సభ్యులతో ఇంద్రసేనా రెడ్డి

తుర్కయంజాల్: పార్టీలో నిబద్ధత కలిగిన నాయకుడు బోసుపల్లి ప్రతాప్ అని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యుడు ప్రతాప్ నివాసంలో.. ఆయన సందడి చేశారు. ప్రతాప్ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. పార్టీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుడికి సన్మానం


కృష్ణయాదవ్‌ను సన్మానిస్తున్న సుంకిరెడ్డి

ఆమనగల్లు: యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కృష్ణయాదవ్‌ను పట్టణంలో సోమవారం టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, రాజు, తోట శ్రీను, కొండల్‌రెడ్డి, పాతకోట రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో కిషన్ రెడ్డి

మాడ్గుల: సంద్రలగడ్డతండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య రెడ్డి, జైపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హరిత కుంభమేళాగా..

వనస్థలిపురం: ప్రయాగ కుంభమేళాను హరిత కుంభమేళాను చేద్దాం, మన జీవ నదులను కాలుష్యం బారి నుంచి కాపాడుకుందాం అంటూ ఆర్ఎస్ఎస్ దిల్‌సుఖ్‌నగర్ విభాగ్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనవరి 13 నుంచి త్రివేణి సంగమం ఐన ప్రయాగలో జరగనున్న కుంభమేళాకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం సేకరించిన స్టీల్ ప్లేట్లు, బట్ట సంచులను ప్రదర్శిస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మేళాలో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, క్యారీ బ్యాగులకు బదులుగా స్టీల్ ప్లేట్లు, బట్ట సంచులు వాడాలని సూచించారు.

హై‘టెన్షన్’ పెట్టకండి

- విద్యుత్ లైన్ల ఏర్పాటుతో నష్టపోతున్నాం
- మా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి
- కలెక్టర్ నారాయణరెడ్డికి రైతుల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

కడ్తాల్: ‘పంట పొలాల మీదుగా విద్యుత్ హైటెన్షన్ లైన్ల ఏర్పాటుతో పంటలను నష్టపోతున్నాం. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ.. మానసిక క్షోభ అనుభవిస్తున్నాం. ఇంకా కొత్త లైన్లు ఏర్పాటు చేస్తే.. ఉపాధి కోల్పోయి.. కుటుంబంతో సహా రోడ్డున పడతాము’ అని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. కడ్తాల గ్రామం మీదుగా విద్యుత్ హైటెన్షన్ లైన్ వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు కలెక్టరేట్ ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కడ్తాల్ గ్రామ సరిహద్దుల గుండా ఇప్పటికే 220 కేవీ, 400 కేవీ, 765 కేవీ సాంద్రత కలిగిన హైటెన్షన్ లైన్లను ఐదు మార్గాల గుండా ఏర్పాటు చేయడంతో నష్టపోతున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం బీదర్– మహేశ్వరం పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ వారు కొత్తగా.. మరోలైను 765 కేవీ పవర్‌లైన్‌ను పొలాల మీదుగా ఏర్పాటు చేస్తే రోడ్డున పడతామని వాపోయారు. విద్యుత్ లైన్ ఏర్పాటుకు సంబంధిత అధికారులు.. రైతులకు, పట్టాదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో పాటు, విద్యుత్ చట్టం 2003లోని కనీస ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆందోళనకు గురిచేస్తున్నారని వాపోయారు. దీనికి స్పందించిన కలెక్టర్.. ఎస్ఈ పవర్‌గ్రిడ్ అధికారులతో చర్చించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రైతులు వెల్లడించారు. మాజీ ఉప సర్పంచ్‌లు జంగారెడ్డి, రామకృష్ణ, రైతులు రవి, వెంకట్‌రాములుగౌడ్, రాములుయాదవ్, రమేశ్, సుదర్శన్, గాంధీ, పెంటారెడ్డి, జంగయ్య, నర్సింహ, జంగారెడ్డి, శివరాజు, అభిషేక్‌రెడ్డి ఉన్నారు.

డివిజన్ స్థాయిలో 18 దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం: ప్రజావాణికి ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధి నుంచి కేవలం 18 దరఖాస్తులు వచ్చాయని ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లోనే కాకుండా డివిజన్ స్థాయిలో ప్రజావాణిని నిర్వహించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం 10.30 గంటలకు ఎంపీడీఓ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించామని ఆర్డీఓ పేర్కొన్నారు. ఇందులో ధరణి, డబుల్ బెడ్రూం ఇండ్లు, మున్సిపాలిటీలోని శానిటేషన్, భూ సేర్వే తదితర శాఖలకు సంబంధించి 18 అర్జీలు వచ్చాయని ఆయన వెల్లడించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు చేరవేశామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఇదిలా ఉండగా.. డివిజన్ స్థాయిలో నిర్వహించిన ప్రజావాణిలో కింది స్థాయి అధికారుల కంటే ముందుగా ఆర్డీఓ అనంతరెడ్డి సమయానికి పాల్గొన్నారు. 10.30 గంటల తర్వాత ఎంపీడీఓలు, ఇతర అధికారులు వచ్చారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి

పీవీ సేవలు చిరస్మరణీయం


కడ్తాల్: పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

- ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చిన మహనీయుడు
- పీవీ వర్ధంతిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న సమయంలో.. సాహసోపేత నిర్ణయాలతో గాడిన పెట్టిన దార్శనికుడు, బహు భాషాకోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పీవీ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, బీక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో పీవీ నర్సింహారావ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, ఎంపీపీ మాజీ సభ్యురాలు అనిత, పార్టీ నాయకులు అంజన్‌రెడ్డి, కృష్ణనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, ఎంగలి ప్రసాద్ తదితరులు ఉన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, నాయకులు సలీం, ఆకాశ్, మనికిరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లులో..

అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే ఉరుకోం

మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ

తుర్కయంజాల్: అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే చూస్తూ ఊరుకోమని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి అన్నారు. సోమవారం ఆమె పురపాలక సంఘం పరిధి కమ్మగూడ 18,19,22 వార్డులోని పలు కాలనీల్లో రూ.4 కోట్ల అంచనా వ్యయంతో సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్‌లో కొనసాగుతున్న పనులకు ఆటంకం కలిగించడం పరిపాటిగా మారిందని, ఎవరు అడ్డు తగిలినా అభివృద్ధిని కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ హరిత, కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు ఐలయ్య, మంగమ్మ, సునీల్, కవిత తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్ నుంచి శాంతి నగర్, అన్నపూర్ణ, మధురానగర్, సుదర్శన నగర్, శివాజీ నగర్, రాఘవ రెడ్డి నగర్, వశిష్ట కాలనీల్లో చేపట్టే రోడ్డు నిర్మాణం విషయంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆ తరువాత కౌన్సిలర్ ఐలయ్య జోక్యంతో వివాదం సద్దుమణిగింది.


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

నేడు కాంగ్రెస్ ర్యాలీ

ఇబ్రహీంపట్నం రూరల్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యాలకు నిరసనగా నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు కొంగరకలాన్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అక్కడ నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు. ర్యాలీలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పెచ్చులూడిన సమాఖ్య భవనం పైకప్పు

కడ్తాల్: భవనం పైకప్పు పెచ్చులు ఊడిన సంఘటన మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సిబ్బంది ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. పెచ్చులు పడిన సమయంలో సిబ్బంది గదిలోనే మరో చోట ఉండటంతో ప్రమాదం తప్పింది, భవనం శిథిలావస్థకు చేరుకోవడంతోనే ఇలా జరిగిందని సిబ్బంది తెలిపారు. సౌకర్యాల లేమితో, శిథిలావస్థలో ఉన్న భవనంలో విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉందని మహిళలు పేర్కొన్నారు. వసతులు, సౌకర్యాలతో నూతన భవనాన్ని నిర్మించాలని సమాఖ్య సిబ్బంది కోరుతున్నారు.


భవనం పైకప్పు

రైతులకు న్యాయం చేస్తాం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

కందుకూరు: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ హామీ ఇచ్చారు. సోమవారం మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ సర్వే నంబర్ 112లో భూములు కోల్పోయిన రైతులు ఆయన్ని కలిసి తమ సమస్య వివరించారు. మొత్తం ఆ సర్వే నంబర్‌లో 844 ఎకరాల భూమిని టీజీఐఐసీ తీసుకుందని, 86 ఎకరాలకు ఇంకా పరిహారం ఇవ్వలేదని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి భూములు కోల్పోయిన రైతులందరికి పరిహారంతో పాటు ప్లాట్లను కేటాయించేలా చొరవ తీసుకుంటామన్నారు. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, కృష్ణనాయక్, అందుగుల సత్యనారాయణ, కె.మధన్‌పాల్‌రెడ్డి, డి.నర్సింహ, బి.బాల్‌రాజ్, పి.శంకర్, జంగయ్య, డి.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడలోని 24వ డివిజన్ ఏఆర్‌సీఆర్ కాలనీలో సోమవారం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి హాజరై పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రామిడి రాంరెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, డీఈఈ నర్సింహరాజు, నాయకులు రవికాంత్‌రెడ్డి, ఏదుళ్ల ప్రతాప్ రెడ్డి, రంజిత్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శుభాకాంక్షలు

కార్పొరేషన్ కేంద్రంలోని శ్రీగాయత్రి స్కూల్ వార్షికోత్సవం, సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మేయర్ పారిజాత ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో గాయత్రి స్కూల్ చైర్మన్ వేల్పు విజయ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ప్రసాద్, ప్రిన్సిపాల్ సామ వినిత్‌రెడ్డి, డైరెక్టర్ అనూష, నాయకులు రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, ఎ.ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న మేయర్

‘స్వచ్ఛంద’ సేవలను వినియోగించుకోండి

కడ్తాల్: స్వచ్ఛంద సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధి కర్కల్‌పహాడ్ గ్రామంలో ఉప్పల, రాధాకృష్ణ, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి వైద్య బృందం సౌజన్యంతో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. వారు ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు అఖిల్, అనిల్, భావనలు 155 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. మాజీ సర్పంచ్ వెంకోబా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లచ్చిరామ్‌నాయక్, నాయకులు యాదయ్య, మహేశ్, శేఖర్, శ్రీశైలం, వీరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివద్ధే లక్ష్యం

మాడ్గుల: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడ్గులలో మరో రెండు నూతన గ్రామాల ఏర్పాటు నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే కొత్త గ్రామాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య రెడ్డి, కొండల్ రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

యాచారం: మండల పరిధి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం యాచారం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రతిభ పాటవ పరీక్ష నిర్వహించారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని టెస్ట్ పెట్టారు. ఈ పరీక్షలో మండల స్థాయిలో అధిక మార్కులు సాధించిన వారిని.. ఈ నెల 27న సాహెబ్‌నగర్‌లోని ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ప్రతిభ పాటవ పరీక్ష మండల కన్వీనర్ సీతారాం తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీదేవి, విజయరాణి, పుష్ప, సాహితి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలకు పరామర్శ

ఆమనగల్లు: బీఆర్ఎస్ ఆమనగల్లు నాయకుడు ఎంగలి రఘు కుటుంబ సభ్యులను సోమవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. రఘు తల్లి సుశీలమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలిసిన జైపాల్‌యాదవ్.. పట్టణంలోని వారి నివాసంలో రఘును, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, మార్కెట్ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాములు, వెంకటేశ్, సాయిలు, యాదయ్య, మహేశ్, దేవేందర్ ఉన్నారు.

అనాథలకు చేయూత

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు ఇంటర్నేషనల్ లయన్స్ డిస్ట్రిక్ట్-320ఏ గవర్నర్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో దుప్పట్లు స్టేషనరీ, స్కూల్ బ్యాగులు తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. 1000 మంది పిల్లల సౌకర్యార్థం వివిధ సామగ్రి అందజేశామని భవిష్యత్‌లో మా సేవలను మరింతా విస్తృతం చేస్తామన్నారు. శేఖర్‌రెడ్డి, సుకేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి ఉన్నారు.

అన్నదాతల ప్రగతితోనే దేశాభివృద్ధి

- డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్
- ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు

ఆమనగల్లు: రైతుల ప్రగతితోనే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేశారు. అనంతరం పలువురు రైతులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రాధమ్మ, సింగిల్‌విండో డైరెక్టర్లు శ్రీపాల్, దోళ్యానాయక్, వెంకటేశ్, నాయకులు వెంకటయ్య, యాదయ్య, జంగయ్య, గన్య, రూప్‌సింగ్, రాజేశ్, సీఈఓ దేవేందర్, సిబ్బంది మహేశ్, సురేశ్, అల్లాజీ పాల్గొన్నారు.


రైతులను సన్మానిస్తున్న వెంకటేశ్

మార్కెట్‌యార్డు ఆవరణలో..

చైర్‌పర్సన్ యాట గీత ఆధ్వర్యంలో రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సత్కరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ డైరెక్టర్లు శ్రీశైలం, రమేశ్‌గౌడ్, సంపత్‌కుమార్, నాయకులు సాబుద్దీన్, జగన్, వస్పుల శ్రీకాంత్, శ్రీను ఉన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి


నూతన కమిటీ సభ్యులతో పార్టీ నాయకులు

మంచాల: బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆగాపల్లి గ్రామంలో నూతనంగా బూత్ నూతన కమిటీని ఎనుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా మహేందర్, రమేష్, ఉపాధ్యక్షులుగా రాజేష్, గణేష్, ప్రధాన కార్యదర్శులుగా ఈశ్వర్ కుమార్, మధుకర్, సాయిలును నియమించారు. ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకుడు బాషయ్య, మండల నాయకులు వెంకటేష్, ఐలయ్య, శ్రీనివాస్, జగన్, యాదయ్య, కృష్ణ, సత్యనారాయణ, శ్రీశైలం, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి పరామర్శ

ఆమనగల్లు: నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ మాజీ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మంద జగన్నాథంను సోమవారం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్యలు పరామర్శించారు. అనంతరం జగన్నాథం కూతురు పల్లవిని ఆయన ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.


జగన్నాథం కూతురుతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ తదితరులు

కందుకూరువాసికి ‘లయన్స్’ లీడర్‌షిప్ మెడల్

కందుకూరు: కందుకూరుకు చెందిన లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లీడర్ షిప్ మెడల్ అందుకున్నారు. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో 17 దేశాల ఇస్లామీ లయన్స్ ఫోరం సమావేశాలను లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఫెబ్రీషియో, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ పాటిహిల్స్, ఇంటర్నేషనల్ ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్‌ల సమక్షంలో నిర్వహించారు. కాగా ఆదివారం రాత్రి లయన్స్‌క్లబ్ తరపున గ్రామాల్లో, జిల్లా వ్యాప్తంగా విరివిగా సేవలందిస్తున్న మహేంద్రకుమార్‌రెడ్డికి లయన్స్‌క్లబ్ అత్యుత్తమ పురస్కారమైన ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లీడర్‌షిప్ మెడల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంతో పాటు బాధ్యతను మరింత పెంచినట్లయిందన్నారు. తనకు సహకరిస్తున్న వారందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కందుకూరు అధ్యక్షుడు ఎస్.విఠల్‌రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి తాళ్ల అంజయ్య, మాజీ అధ్యక్షులు భీంరెడ్డి, రాంరెడ్డి, దీపారెడ్డి తదితరులు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు.


ప్రెసిడెంట్ మెడల్ అందుకుంటున్న డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ అనుమతిలేకుండా ఈవెంట్లు నిర్వహిస్తే చర్యలు

ఆమనగల్లు: నూతన సంవత్సరం సందర్భంగా పర్మిషన్ లేకుండా ఈవెంట్లలో మద్యం వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఫంక్షన్‌హాల్స్, ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లలో ఈవెంట్ల నిర్వాహకులు రూ.9 వేలు చెల్లించి, మద్యం అనుమతి తీసుకోవాలని సూచించారు.

◆ నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ ఫీడర్లలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు మండల కేంద్రం, బీసీ కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని ఏఈ నరేందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

◆ కబ్జాదారుల నుంచి రోడ్డును కాపాడండి

యాచారం: మండల పరిధి నల్లవెల్లి గ్రామానికి వెళ్లే రోడ్డును ఇరు వైపులా అక్రమార్కులు కబ్జాకు పాల్పడుతున్నారని, సర్వే చేసి కబ్జా చేర నుంచి రోడ్డును కాపాడాలని నల్లవెల్లి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ అయ్యప్పకు ఫిర్యాదు చేశారు. రోడ్డును ఆక్రమించడం వలన వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో రాములు, పాండు తదితరులు పాల్గొన్నారు.